వైఎస్ఆర్ కడప వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
బుధవారం 29 ఏప్రిల్ 2026

సిఐ కార్యాలయం ను సందర్శించిన డిఐజి, ఎఎస్పి..

సుండుపల్లె,ఏప్రిల్ 28,ప్రభాతవార్త:

సుండుపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన సిఐ కార్యాలయను డి ఐ జి కోయ. ప్రవీణ్, 28వ తేది న సందర్శించారు. నూతనంగా ఏర్పాటు కావడంతో ఆయన పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్లోని రికార్డులు, కేసుల నిర్వహణ, సిబ్బంది హాజరు తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ప్రజలకు పోలీస్ సేవలు మరింత మెరుగ్గా అందించాలని, కేసుల దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలని డీఐజీ సిబ్బందికి సూచించారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, శాంతి భద్రతల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా విధుల్లో నిరక్ష్యం వహించవద్దని హెచ్చరించిన డీఐజీ, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అల్లరి మూకలు అల్లర్లు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి డ్రగ్స్ వంటి వాటిపైన విద్యార్థులకు యువకులకు అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ వలన జరిగే అనర్థాలను తెలియజేస్తే మరింత మార్పు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఏఎస్పి మనోజ్ రామ్నాథ్ హెగ్డే రాజంపేట రూరల్ సీఐ ఏపీ మస్తాన్, ఎస్ఐ ఎస్కేయం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ చేసిన సీఐ చల్లని దొర

పెండ్లిమర్రి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

పెండ్లిమర్రిలోని చెర్లోపల్లె క్రాస్ వద్ద మంగళవారం పెండ్లిమర్రి సీఐ చల్లని దొర తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. వాహనదారులు లైసెన్సులు కలిగి ఉండాలని రోడ్డు నియమ నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలకు సరైన పత్రాలు లేని వాహనాల యజమానులకు రూ.1295 జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బద్వేలులో పన్నుల

మోత

- సర్వేపేరుతో నిలుపు దోపిడి
- 2026 పన్ను చెల్లించినా మళ్లి 3మూడేళ్ల పన్ను కట్టాలంటున్న అధికారులు
- జిల్లాలో ఎక్కడ లేని విధంగా వసూళ్లు
- డెవలప్మెంటు ఛార్జీలు కట్టిన ప్రాంతంలో అభివృద్ధి శూన్యం
- చార్జీలు కట్టని ప్రాంతంలో అభివృద్ధి
- పట్టించుకోని రాజకీయ నాయకులు

బద్వేలు ,ఏప్రిల్ 28, ప్రభాతవార్త :

బద్వేలు మున్సిపాలిటీలో పన్నుల మోత మోగుతోంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పన్నులు వసూలు చేస్తుండడంతో ప్రజలు మండిపడుతున్నారు. 2026కు ఇంటిపన్నులు చెల్లించినప్పటికీ మళ్లి 3 సంవత్సరాల పన్ను కట్టాలంటూ నోటీసులు జారీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వే చేశాం. 3 సంవత్సరాల పన్నులు కట్టి తీరాల్సిందేనని అధికారులు హుకుం జారీ చేస్తున్నారు. సర్వే జరిగింది ఎప్పుడు, ఇంటి పన్నులు వేసేదెప్పుడు, ఇప్పుడు 3 సంవత్సరాల పన్ను ఎందుకు కట్టాలని ప్రజలు ప్రశ్నిస్తున్నా అధికారులు మాత్రం వాటిని లెక్క చేయక పన్ను వసూళ్లకు శ్రీకారం చుట్టడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఒక్కో సామాన్యుడి ఇంటికి రూ.10 నుంచి 20వేల వరకు పన్నులు వసూలు చేస్తున్నారు. ఇక పెద్ద భవనమైతే రూ.50వేలు దాటే పరిస్థితి ఏర్పడుతుంది. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా పన్నుల మోత మోగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తల్లడిల్లుతున్నారు. ఇదెక్కడి పన్నురా నాయనా హైదరాబాదులో కూడా ఇంత ఉండకపోవచ్చేమో, ఈ చిన్న పట్టణంలో ఇంత పన్నులు ఎలాంటి మౌలిక వసతులు లేని పట్టణంలో ఇంత వసూలు చేస్తారా, ఇష్టానురాజ్యంగా పన్నులు వేయడం ఏమిటో, ఇంతజరుగుతున్నా ప్రజలు గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వంలోని పెద్దలైన నాయకులు ఎందుకు ప్రజల తరపున అధికారులను ప్రశ్నించడం లేదని ఆగ్రహిస్తున్నారు. ఇదిలా ఉంటే కోట్ల రూపాయల పన్ను వసూలు చేశారే గాని అభివృద్ధి ఏమైనా చేశారా అని చూస్తే ఎక్కడ కనపడడంలేదు. పన్నులు ఎక్కువగా కట్టేది పేదలు, సామాన్యులు అయినప్పటికీ ఆ వార్డులలో అబివృద్ధి ఉండదు. తక్కువ పన్నులు కట్టే ప్రాంతంలో వద్దన్నా అభివృద్ధి చేసే పరిస్థితి ఏర్పడుతుంది. ఎన్నో సంవత్సరాలుగా శివానగర్,ఫాతిమానగర్, సుమిత్రానగర్లో సరైన రహదారులు లేక ప్రజలు అల్లాడుతుంటే ఇంతవరకు ఒక రోడ్డు వేసిన పాపాన పోలేదు. చుట్టూ ఇల్లులేని ప్రాంతంలో అవసరం లేని చోట రాజకీయ నాయకుల లబ్దికోసం ఎలాంటి పన్నులు చెల్లించని ఖాళీ స్థలాలకు రోడ్లు వేస్తున్నారు. పట్టణంలో పోరుమామిళ్ల రోడ్డులో ఎక్కువగా రిజిస్టర్ స్థలాలు ఉన్న ప్రాంతంలో ఒకప్రైవేట నరసింహా థియేటర్ వెనుక బాగంలో డెవలప్మెంటు చార్జీల పేరిట కోట్ల రూపాయలు వసూలు చేశారు. ఇంతవరకు అక్కడ ఒక డ్రైనేజీ గాని, రోడ్డు గాని వేయలేదు. ఎన్జీవో కాలనీ పరిసరాలలో ఎలాంటి డెవలప్మెంటు చార్జీలు చెల్లించకపోయినా కోట్ల రూపాయలు పెట్టి వారి ఇళ్లకు రహదారులు వేసుకునే విధంగా అదికారులు దగ్గరుండి వేయించారంటే దీనిని బట్టి చూస్తుంటే బద్వేలులో ఏమాత్రం అబివృద్ధి జరిగిందో అర్థమవుతుందని ప్రజలు మండిపడుతున్నారు. 2025-26కు ఒక ఇంటికి 3వేలు పన్ను విధిస్తే ఇదే సమయంలో అధనపు చార్జీల పేరుతో రూ.18వేలు పన్ను కట్టాలని నోటీసులు ఇచ్చారు. ఇదెక్కడి న్యాయం అని అడిగినా సమాధానం చెప్పేవారు లేరు. ఎంత పన్ను వేస్తే అంత కట్టవలసిందే అన్నట్లుగా తయారైంది బద్వేలు మున్సిపాలిటీ. ఇక నాయకులు అంటారా వారి పనులలో బిజిగా ఉన్నారే తప్ప ప్రజా సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి భువనగిరిపల్లెలో

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

భువనగిరి పల్లె లక్ష్మీ నరసింహ స్వామి, బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన భువనగిరి కొండ

రాజంపేట, ఏప్రిల్ 28 ప్రభాతవార్త

రాజంపేట మండలం కడప రేణిగుంట జాతీయ రహదారి పక్కనే భువనగిరి కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. ఇప్పటికే కొండపై విద్యుత్ అలంకరణ పూర్తి చేశారు. కొండ పరిసరాలతో పాటు, రహదారి వెంట విద్యుత్ అలంకరణ చేశారు. ఆలయ శుద్ధి కోసం కోయిల్ అల్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని ఇప్పటికే పూర్తి చేశారు. బుధవారం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. గురువారం లక్ష్మీనరసింహస్వామి జయంతిని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. మే 2న స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. మూడు రోజులపాటు ప్రతిరోజు రాత్రి లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం ఉంటుందని ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పూల హరిప్రసాద్ ,కావేటి గారి వెంకటరమణ, కేఎస్ నరసింహ ,మన్నేరు లక్ష్మీ నరసయ్య, నామాల రాజశేఖర్, కంబాయిగారి సుబ్బ నరసింహులు, కొమ్మూరు సుబ్బ నరసయ్య తెలిపారు. భక్తులు లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని స్వామి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు.

రాజంపేట వరదగారి పల్లె రోడ్డు సమస్య

త్వరలో పరిష్కరిస్తాం

టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు



సమస్యల పరిష్కారం కోసం అధికారులతో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

రాజంపేట, ఏప్రిల్ 28 ప్రభాతవార్త

రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ క్రీడా మైదానం నుంచి వెంకటపల్లె, వరదయ్య గారి పల్లె వరకు రోడ్డు అధ్వానంగా ఉందని త్వరలో అధికారుల దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కరిస్తామని జగన్మోహన్రాజు గ్రామస్తులకు హామీ ఇచ్చారు.గ్రామాల అభివృద్ధికి , ప్రధానంగా రహదారుల మరమ్మతులకు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తానని చెప్పారు .తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజును వరదయ్య గారి పల్లె, వెంకట పల్లెకు చెందిన గ్రామ పెద్దలు, పలువురు పార్టీ ముఖ్య నాయకులు కలిశారు. వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిస్తూ,గ్రామాల్లో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కారం దిశగా కృషి చేయాలని అధికారులకు సూచించారు.సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయిస్తానని,అలాగే కూటమి ప్రభుత్వం రైతు, మహిళా సంక్షేమం కోసం పనిచేస్తుందని చమర్తి తెలియజేశారు.అంతకుముందు చమర్తిని గ్రామస్తులు మరియు పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు.పాపరాజుపల్లి సమస్యకు చమర్తి పరిష్కారం మండలంలోని శేషమాంబ పురం పాపిరాచపల్లి గ్రామంలో నెలకొన్న పంప్ సెట్ దారి సమస్య వివాదానికి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు చొరవ తీసుకుని సమస్య పరిష్కరించారు.పంప్ సెట్ దారి సమస్య పరిష్కారానికి ఇటు గ్రామస్తులు, అటు అధికారులుతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.దారిని సైతం ఏర్పాటు చేశారు.

ముద్దనూరు లో 'శంకర్ దాదా'ల

హద్దులు లేని వైద్యం

ముద్దనూరు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:

మండలంలో కొందరు ఆర్ఎంపీ వైద్యుల ఆగడాలు శృతి మించుతున్నాయి. కేవలం ప్రథమ చికిత్సకు మాత్రమే పరిమితం కావాల్సిన వీరు, తామే స్వయంగా స్పెషలిస్ట్ డాక్టర్లమంటూ చెలగాటమాడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అమాయక ప్రజల ప్రాణాలను ఫణంగా పెడుతున్నారు. సాధారణంగా ప్రథమ చికిత్స ఇవ్వడం వరకే ఆర్ఎంపీల పరిధి. కానీ, మండలంలో సీన్ రివర్స్ అవుతోంది. పరిమితి దాటి ఏకంగా దెబ్బలకు కుట్లు వంటివి చేస్తూ చిన్నపాటి అనారోగ్యంతో వెళ్లినా సరే, రోగులకు భారీ డోసుల యాంటీబయాటిక్స్ ఇస్తూ వారి రోగ నిరోధక శక్తిని దెబ్బతీస్తున్నారు. మండలంలోని కొందరు యువకులు రెమిడి ఇంజక్షన్లు, శక్తివంతమైన పెయిన్ కిల్లర్ ఇంజక్షన్లకు బానిసలవుతున్నారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒళ్లు నొప్పులని వెళ్లే యువతకు అత్యంత శక్తివంతమైన ప్రభావం ఉన్న పెయిన్ కిల్లర్ ఇంజెక్షన్లు, ట్యాబ్లెట్లు అలవాటు చేస్తున్నారు.ఒకసారి ఆ మందులకు అలవాటు పడిన యువత, అవి లేనిదే ఉండలేని స్థితికి చేరుకుంటున్నారు. దీన్నే అదనుగా చేసుకున్న ఆర్.ఎం.పిలు అధిక ధరలకు ఆ మందులను విక్రయిస్తూ యువత భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తున్నారు.అరకొర వైద్యంతో రోగాన్ని నయం చేయడం పక్కన పెట్టి, రోగిని శాశ్వత రోగిగా మారుస్తున్నారు. రోగ నిర్ధారణ తెలియకపోయినా ఖిట్రయల్ అండ్ ఎర్రర్ఖి పద్ధతిలో రకరకాల ప్రయోగాలు చేస్తూ, పరిస్థితి విషమించాక "మా వల్ల కాదు.. పై ఆసుపత్రికి తీసుకెళ్లండి" అంటూ చేతులెత్తేస్తున్నారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయి, కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఇప్పటికీ అయినా అధికారులు స్పందించి తనిఖీలు నిర్వహించి, అర్హత లేని ఆర్.ఎం.పి క్లినిక్లను సీజ్ చేయడంతో పాటు, అక్రమంగా మత్తు మందులు సరఫరా చేస్తున్న వారిపై పి.డి యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఆర్ఎంపీలు ఇష్టారాజ్యంగా క్లినిక్లు నిర్వహిస్తూ అడ్డగోలుగా సంపాదిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అంతే కాకుండా మందుల షాపుల యజమానులు డాక్టర్ సలహా మేరకు మందులు ఇవ్వాల్సింది పోయి ఇష్టానుసారంగా ఏ మందులు అడిగిన సొంతంగా వారే ఇస్తున్నారు.ఇంత జరుగుతున్నా వైద్యశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



శ్రీ చెన్నకేశవ స్వామి కళ్యాణం కమనీయం

రాజుపాలెం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త.

మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం మూలవిరాట్ శ్రీ చెన్నకేశవ స్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా కళ్యాణం అంగరంగ వైభవంగా భక్తజన సందోహంతో, వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య కమనీయంగా జరిగినది. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ జి.ఎల్ నారాయణరెడ్డి, ఈవో వెంకటరమణ ఆధ్వర్యంలో స్వామి వారి కళ్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణం లో వేద పండితులు నిర్వహించు ప్రతి కళ్యాణ ఘట్టంలో ప్రత్యేక పూజలతో శాస్త్రోత్తంగా, నిర్వహిస్తూ ప్రతి ఘట్టం యొక్క విశిష్టతను తెలుపుతూ కళ్యాణంలో జరుపుకునే ప్రతి ఘట్టం ఎందుకు జరుపుకుంటమోతో వేద పండితులు వివరించారు. ముఖ్యంగా ఎదురుకోల్లు కార్యక్రమం ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నది. కళ్యాణం లోని విశ్వసేన ఆరాధన, రక్షాబంధనం మధు భార్గము, మాంగళ్య పూజ మంగళ ధారణ వంటి కార్యక్రమాల విశిష్టతను భక్తులకు వివరించడమైనది. పుణ్యక్షేత్రం లోని శ్రీ సంజీవరాయ స్వామి, శ్రీ చెన్నకేశవ స్వామి,శ్రీ భీ మలింగేశ్వర స్వామి, ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు భక్తులకు ప్రత్యేక సౌకర్యాలుగా ఏర్పాటు చేశారు. రాత్రి స్వామి వారు శ్రీదేవి భూదేవి సమేతంగా శేష వాహనం పైన మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుదెల సుబ్బిరెడ్డి, రామ సుబ్బారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వృధాగా పోతున్న తెలుగుగంగ నీరు

కలసపాడు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:

మండలంలోని తెలుగుగంగ అధికారులు పట్టించుకోకపోవడంతో చెన్నారెడ్డి పల్లి గ్రామం దగ్గర తెలుగు గంగనీరు వృధా అయిపోతున్నది. అంతేకాకుండా అక్కడ పెద్ద గుంత ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు పట్టించుకోని వృధా కాకుండా చెరువులనీరు నింపాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యమే ప్రజల ఆరోగ్యం

పులివెందుల, ఏప్రిల్ 28 , ప్రభాత వార్త :

పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం కాపాడితేనే ప్రజల ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని మునిసిపల్ కమిషనర్ మునికుమార్ పేర్కొన్నారు. ప్రపంచ కార్మికుల భద్రత మరియు ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పులివెందుల పురపాలక సంఘం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని మునిసిపల్ కమిషనర్ మునికుమార్, ఐసిటీసీ కౌన్సిలర్ వెంకట సుబ్బయ్య సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిటీసీ కౌన్సిలర్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ, పారిశుద్ధ్య కార్మికులు తమ విధుల్లో ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు మరియు వాటి నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత రక్షణ పరికరాలు వినియోగం, శుభ్రత పాటించడం, సమయానుకూల ఆరోగ్య పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా వేసవికాలంలో తీసుకోవా ల్సిన జాగ్రత్తలను తెలియజే శారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ మునికుమార్ మాట్లాడుతూ, పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి వెన్నెముకలాంటి వారని, వారి ఆరోగ్యం, భద్రతకు పురపాలక సంఘం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య వివరాలను నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురపాలక మేనేజర్ సతీష్ కమలాకర్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు, పర్యావరణ మరియు పారిశుద్ధ్య శాఖ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

సమస్యల గురించి వివరిస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు, సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మునికుమార్

వాకర్స్ అసోసియేషన్‌కు కొత్త కమిటీ

నందలూరు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :

వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్302 పరిధిలోని నందలూరు వాకర్స్ అసోసియేషన్ (చార్టర్ నంబర్: 958) నూతన కార్యవర్గాన్ని నియమించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఉప్పు శెట్టి సుధీర్ కుమార్, జనరల్ సెక్రటరీగా గంధం గంగాధర్, ట్రెజరర్‌గా యంబలూరు ప్రదీప్ బాధ్యతలు స్వీకరించారు. ఈ నియామకాలకు డిస్ట్రిక్ట్302 గవర్నర్ రామచంద్రా రెడ్డి, ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ పి. రవిరాజు ఆమోదం తెలిపినట్లు డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ మన్యం రామ్మోహన్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందలూరు ప్రాంతంలో వాకర్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడినట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కమిటీకి సంపూర్ణ సహకారం అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఉప్పు శెట్టి సుధీర్ మాట్లాడుతూ, సమాజ సేవను మరింత విస్తరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

కోలాటం,చెక్కభజనను విజయవంతం చేయండి

వైవీయూ, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ కొందరివాడు కాదు అందరివాడు అంటూ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పనతల సురేష్, బిజెపి జిల్లా ఎస్సి మోర్చ అధ్యక్షుడు డాక్టర్ పుటిక వెంకటరమణ ఆధ్వర్యంలో కడప ఆర్ట్స్ గ్రౌండ్ లో విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బిఆర్ అంబేద్కర్ 135 జయంతి ఉత్సవాలను కడప ఆర్ట్స్ గ్రౌండ్ లో ఘనంగా నిర్వహిస్తున్నామని , ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పినట్టు సబ్కా సాత్ సబ్కా వికాస్ . రాజకీయ ఫలాలు దేశ ప్రజలందరికీ అందాల అన్నట్టు కళాకారులను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. రాయలసీమ ప్రాంత నలుమూలల నుంచి 100 దాకా చెక్కభజన కోలాటం గ్రూపులు పాల్గొంటాయి. ఈ కార్యక్రమానికి ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బిజెపి పార్టీ అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పాల్గొంటారు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బీరం సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సందడిగా ప్రారంభం

తొండూరు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా తొండూరు శాఖ గ్రంథాలయంలో మంగళవారం 'సమ్మర్ క్యాంప్ 2026'ను ఘనంగా ప్రారంభించారు. ఈ క్యాంపులో 18 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి స్వరూప రాణి క్యాంప్‌ను ప్రారంభించిన అనంతరం పిల్లలతో కథలు చెప్పించారు. తమకు నచ్చిన కథలను విద్యార్థులు సొంత శైలిలో చెప్పి అందరినీ అలరించారు. అనంతరం పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వయసుకు తగిన బాల సాహిత్యం,నీతి కథల పుస్తకాలను అందించి చదివించారు. చివరగా పిల్లలందరితో లూడో గేమ్స్ ఆడించి విజేతలకు బహుమతులు అందించారు."సెలవుల్లో పిల్లలు టీవీ,ఫోన్‌లకు అతుక్కుపోకుండా పుస్తకాలతో స్నేహం చేయాలనే ఉద్దేశంతో ఈ క్యాంప్ పెట్టాం. చదువుతో పాటు ఆటలు కూడా ఉంటే పిల్లలు ఆసక్తిగా వస్తారు" అని గ్రంథాలయ అధికారిని స్వరూప రాణి తెలిపారు.

ఎమ్మెల్యేపై పదేపదే నిరాధార ఆరోపణలు చేయడం తగదు

ప్రొద్దుటూరు ఏప్రిల్ 28 ప్రభాతవార్త

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆయన తనయుడు కొండారెడ్డిపై పదే పదే నిరాధార ఆరోపణలు చేయడం మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి తగదని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ఘంటసాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నెహ్రూ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుండి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వైసీపీ నాయకులు పలువురు పదేపదే స్థానిక సంస్థలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఆయన తనయుడు నంద్యాల కొండారెడ్డిపై బురదజల్లే యత్నం చేస్తూ ప్రభుత్వ భూమిని కాజేసే యత్నం చేస్తున్నారని నిందారోపణలు చేస్తున్నారని, ఇందుకు గానూ వారి వద్ద ఏమైనా ఆధారాలుంటే నిరూపించాలని డిమాండ్ చేశారు. పదేపదే ప్రమాణాలు చేస్తామనే వైసీపీ నాయకులు నందం సుబ్బయ్య హత్య విషయంలో ప్రమాణానికి సిద్దమా అని, వారు సిద్దమని చెబితే తాను కాణిపాకం లో ప్రమాణానికి సిద్దమని వివరించారు. ఇకనైనా ఇటువంటి చవకబారు విమర్శలు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాబు పాల్గొన్నారు.

పెట్రోల్ డీజిల్ కొరతతో ఎన్నో ఇబ్బందులు

ప్రొద్దుటూరు ఏప్రిల్ 28 ప్రభాతవార్త

రాష్ట్రంలో పెట్రోల్ డీజిల్ వరద వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తన నివాసంలో విలేఖరుల మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా డీజల్ పెట్రోల్ కొరత వుందని, భారత దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలలో పెట్రోల్ డీజిల్ బంకులలో నో స్టాక్ అనే బోర్డ్ కనబడుతోందని, దీని వలన రైతులకు చాలా నష్టం కలుగుతుందని, ఆటో డ్రైవర్‌ల పరిస్థితి దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల సంక్షోభం, ట్రాన్స్ పోర్ట్ తిప్పలు ఉన్నాయన్నారు. పత్రికలు డీజిల్ పెట్రోల్‌పై హెచ్చరించినా కూడా ముఖ్యమంత్రికి కళ్ళు కనిపించలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఏపి విశాదాలు సంక్షోభాలు జరిగిన తాడేపల్లిలో జగన్ కుట్ర చేసాడు అనుకుంటున్నారని, భవిష్యత్తులో మంత్రుల ఇళ్ళలో భార్యలు అన్నం పెట్టకపోయిన జగన్ తాడేపల్లిలో ఉండి కుట్ర చేసాడు అంటారని విమర్శించారు. రాష్ట్రాన్ని పరిపాలించే అదికారం చంద్రబాబుకు లేదన్నారు. డీజిల్ పెట్రోల్ కొరత అపలేని వాడివి తుఫాన్ ఎలా అపావు ఎండను ఎలా తగ్గించావ్ అని ప్రశ్నించారు. కొరత లేకుండా రాష్ట్రాన్ని కాపాడాలని సూచించారు.

ప్రొద్దుటూరులో బిసి భవన్ ఏర్పాటుకు కృషి చేస్తా : ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు ఏప్రిల్ 28 ప్రభాతవార్త

నియోజకవర్గ పరిధిలో అధిక శాతం బీసీలు ఉన్నారని వారి అభివృద్ధి కోసం బీసీ భవన్ ఏర్పాటు కు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ప్రొద్దుటూరు బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక నూతన బస్టాండ్ ఎదురుగా ఏర్పాటుచేసిన సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే సతీమణి సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ గత 12 ఏళ్ల క్రితం ఇదే ప్రాంతంలో సంఘసంస్కర్త సమాజ హితం కోరిన మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఇదే ప్రాంతంలో సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే సార్థకత ఉంటుందన్న ఉద్దేశంతో బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షులు బొర్రా రామాంజనేయులు మరియు కొంతమంది బీసీ నాయకులు తన దృష్టికి తెచ్చారన్నారు. వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి సావిత్రిబాయి పూలే విగ్రహం ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. ప్రొద్దుటూరు బిసి ప్రజా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సావిత్రిబాయి పూలే విగ్రహం ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. సమాజంలో మహిళల పట్ల చిన్నచూపు ఉన్న కాలంలో మహిళల అభివృద్ధి కోసం వారికి విద్యను అందించే దిశగా పోరాటం చేసిన మహిళ సావిత్రిబాయి పూలే అని ఆయన కొనియాడారు. అలాంటి ఆమె విగ్రహం ఆవిష్కరించడం తన పూర్వజన్మ సుకృతం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో బీసీల అభివృద్ధి కోసం తాను సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాను అలాగే ప్రొద్దుటూరు పట్టణంలో బీసీ భవన్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో మాట్లాడి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా బొర్రా రామాంజనేయులు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే విగ్రహ ఏర్పాటుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీలంతా ఏకమై రాజ్యాధికారం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు టిడిపి పట్టణ అధ్యక్షులు బిసి నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బిసి వర్గాలు అధికంగా ఉన్నాయని బీసీ కులాల అభివృద్ధి కోసం మనమంతా ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. బిసిల అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మరియు టిడిపి నాయకులు పగడాల దస్తగిరి రిటైర్డ్ ఎస్సై శివశంకర్ మండ్ల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల రికార్డులను పరిశీలించిన ఆర్డీవో, డి.ఎస్.పి

ముద్దనూరు,ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

మండల పరిధిలోని పెట్రోల్ బంకులను మంగళవారం నాడు జమ్మలమడుగు ఇంచార్జ్ ఆర్డిఓ శిరీష, డీఎస్పీ వెంకటేశ్వరరావు పెట్రోల్ డీజిల్ నిల్వల రికార్డులను పరిశీలించి మండల ప్రజలకు కొరత లేకుండా డీజిల్ సరఫరాల అందించాలని సూచించారు. అనంతరం పెట్రోల్ డీజిల్ స్టాక్ రికార్డులను పరిశీలించారు. స్టాకు వచ్చినప్పుడు సంబంధిత అధికారులకు తెలియపరచి వారి ఆధ్వర్యంలోనే విక్రయాలు చేపట్టాలని ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ట్రాఫిక్ సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొరత చూపించి అధిక రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మండల ప్రజలకు ఇబ్బంది కలగకుండా పెట్రోల్ డీజిల్ అందుబాటులో ఉంచాలని, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా పెద్ద మొత్తంలో డీజిల్ ఎవరికి సరఫరా చేయకూడదని పేర్కొన్నారు. ఎవరైనా నియమాలను అధిక్రమించి పెట్రోల్ డీజిల్ అధిక రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొని పెట్రోల్ బంకుల లైసెన్సులు రద్దు చేస్తామని ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ ఎండి అలీ ఖాన్, సిఐ నగేష్ బాబు, వీఆర్వో రాజశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రి బాయి పూలే విగ్రహావిష్కరణ

కడప కార్పొరేషన్ ఏప్రిల్ 28 ప్రభాతవార్త:

స్త్రీ విజ్ఞాన వికాసానికి చదివే మూలం అని చాటి చెప్పిన, భారతదేశపు తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద నాగరాజు అన్నారు. బొర్రా రామాంజనేయులు మార్గ నిర్దేశంలో బీసీ ప్రజా చైతన్య సమాఖ్య వారి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంగళవారం ప్రొద్దుటూరులో ఘనంగా నిర్వహించారు. కడప జిల్లా అధ్యక్షులు బత్తాల లింగమూర్తి, క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ కల్యా సుధాకర్, సివిల్ సప్లై డైరెక్టర్ చిట్టిపోయిన సుబ్బరాయుడు యాదవ్, కడప నగర కమిటీ అధ్యక్షుడు గొడుగు హరికుమార్, మహిళా నాయకురాలు స్వర్ణలత పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నేత మృతి బాధాకరం

కడప కార్పొరేషన్ ఏప్రిల్ 28 ప్రభాతవార్త:

నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) వేషధారణతో కడప నగరంలో సైకిల్ పై తిరుగుతూ.. తనదైన శైలిలో తెలుగుదేశం పార్టీకి చిహ్నంగా నిలుస్తూ.. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపి కోసం పరితపిస్తూ అహర్నిశలు టిడిపి కోసమే జీవించిన రామానాయుడు(67) అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని తెలుగుదేశం పార్టీ కడప నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ విఎస్. అమీర్ బాబు అన్నారు. మంగళవారం కడప చిన్నచౌకు కొండాయపల్లిలోని తన స్వగృహంలో టిడిపి సీనియర్ నేత రామానాయుడు భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామానాయుడు కుటుంబాన్ని అమీర్ బాబు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాసర్ , సంఘం జాకీరుద్దీన్ పాల్గొన్నారు.

అధిక ఉష్ణోగ్రత పట్ల జాగ్రత్త వహించండి

సిద్దవటం ఏప్రిల్ 28 ప్రభాతవార్త

అధిక ఉష్ణోగ్రతపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తప్పకుండా పాటించాలని 104 వైద్య సిబ్బంది సూచించారు మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారి నిర్మలగిరి కాలనీలో మంగళవారం మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య ఆధ్వర్యంలో 104 వైద్య శిబిరం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీవిద్య మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల పట్ల ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని వడదెబ్బ నివారణకు చల్లని త్రాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పకుండా తీసుకోవాలని అవసరం ఉంటే తప్ప ఎవరు బయటకు రావద్దని ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుని సంప్రదించి సలహాలు సూచనలు తీసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బంది 104 సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ దేవస్థాన చెర్మన్‌ను పరామర్శించిన తులసి రెడ్డి

వేంపల్లి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త

వేంపల్లి శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు (కొండయ్య) ఇటీవల అనారోగ్యంతో హైదరాబాదులో కడుపుకు శస్త్ర చికిత్స చేయించుకుని వేంపల్లి లోని ఆయన స్వగృహం చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న,బండారు వెంకటేశు, నామా వినయ్ , ఐచర్ రమణ లు కలిసి దేవస్థాన మాజీ చైర్మన్ కొండయ్యను ఇంటి వద్ద పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కొండయ్య త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

వేంపల్లె: ఏప్రిల్ 28 ప్రభాతవార్త

చిత్తూరు జిల్లాలో ఆంధ్రజ్యోతి విలేకరి కె. జగన్ మోహన్ రెడ్డిని అతి దారుణంగా హత్య చేయడం పట్ల వేంపల్లె జర్నలిస్టులు తీవ్ర దిగ్భ్రాంతిని, నిరసనను వ్యక్తం చేశారు. మంగళవారం వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో సిఐ నర్సింహులును కలిసి జర్నలిస్టులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా పలువురు సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎత్తిచూపే విలేకరులపై ఇలాంటి దాడులు జరగడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న విలేకరిని మాటు వేసి అత్యంత క్రూరంగా చంపడం పిరికిపంద చర్య అని అభివర్ణించారు. జగన్ మోహన్ రెడ్డి హత్య కేసులో నిందితులను వెంటనే గుర్తించి కఠినమైన శిక్షలు పడేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె మండలంలోని ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిత్యాన్నదాత డొక్కా సీతమ్మకు ఘన నివాళి

వేంపల్లె:ఏప్రిల్ 28 ప్రభాతవార్త

జనసేన పార్టీ సీనియర్ నేత దాసరి రవిశంకర్ ఆధ్వర్యంలో స్థానిక పట్టణంలోని ఆయన కార్యాలయంలో నిత్యాన్నదాతగా, అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందిన డొక్కా సీతమ్మ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా దాసరి రవిశంకర్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా పేరు పెట్టడం అభినందనీయమన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కన్నా గొప్ప దానం లేదనే సందేశాన్ని ఆమె తన జీవితంతో చాటి చెప్పారని తెలిపారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అనే భారతీయ సంప్రదాయాన్ని ఆచరణలో చూపిన మహనీయురాలు డొక్కా సీతమ్మ అని పేర్కొన్నారు. ఆమె జీవితం అన్నదానం గొప్పతనానికి నిలువెత్తు నిదర్శనమని దాసరి రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నకృష్ణ రెడ్డి, మత్తయ్య, కృష్ణ, గంగన్న, సాయి తదితరులు పాల్గొన్నారు.

విలేకరి హత్య అమానుషం : జాప్ రాజారెడ్డి

కడప ఏప్రిల్ 28 ప్రభాతవార్త

విలేఖరి జగన్మోహన్‌రెడ్డిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి. చివరికి జర్నలిస్టులను వేట కొడవళతో నరికి చంపే ఆటవిక స్థితికి పరిస్థితి వచ్చింది. జర్నలిస్టుల జీవితాలు ఎంత ప్రమాదంలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. నిరంతరం భయంతో బతుకులు సాగించాల్సిన పరిస్థితి దాపురించింది. ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు సీనియర్ పాత్రికయులు రాజారెడ్డి కోరారు.

37 సం రాలు తల్లికి నార్మల్ 7 వ కాన్పు చేసిన డాక్టర్

సుండుపల్లె, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :

శిద్దారెడ్డిగారి పల్లెకు చెందిన 37 సంవత్సరాల గులాబ్జాన్ అనే తల్లి ఏడవ కాన్పులో పండంటి మగ బిడ్డ జన్మించారని, బిడ్డ 2 కేజీల బరువు ఉన్నాడని సుండుపల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ దిలీప్ గుప్తా, మరియు డాక్టర్ ఫర్హా ఖానం తెలిపారు. హై రిస్క్ కాన్పు కాబట్టి, తల్లికి డాక్టర్లే స్వయంగా డెలివరీ చేశారు. తల్లి, పురిటి బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారని తెలియచేశారు. సుండుపల్లి మండల ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న తల్లి పురిటిపిల్లల మరియు అన్నిరకాల సేవలు వినియగించుకోవాలని మరియు ప్రతి నెల 10 వ తేదీ డాక్టర్ సంయుక్త ప్రసూతి మరియు స్త్రీ వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారు అని డాక్టర్ దిలీప్ గుప్తా తెలిపారు.

విలేఖరిని హత్య చేయడం దారుణం

సిద్ధవటం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త

విలేఖరి జగన్మోహన్ రెడ్డిని అతి దారుణంగా హత్య చేయడంపై సిద్ధవటం మండల డిప్యూటీ తాసిల్దార్ మాధవి లతకు మండల పాత్రికేయుడు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి విలేకరిపై దారుణంగా హత్య చేయడం దుర్మార్గమైన చర్య అని పాత్రికేయులకు రక్షణ లేకుండా పోతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే చర్యలు తీసుకొని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు.

హెల్మెట్ ధరించకపోతే కఠినమైన చర్యలు

సిద్ధవటం ఏప్రిల్ 28 ప్రభాతవార్త

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోతే కఠినమైన చర్యలు తప్పవని ఎస్సై హరిక హెచ్చరించారు సిద్ధవటం గ్రామ శివారులోని ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద మంగళవారం రాత్రి మండల ఎస్సై హరిక విస్తృత వాహనాలు తనిఖీ చేపట్టారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడప జిల్లా ఎస్పీ ఆదేశాలతో ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ప్రమాదాలు అరికట్టేందుకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు హెల్మెట్, వాహన పత్రాలు లేని ద్విచక్ర వాహనదారులకు ఒక్కో వాహనానికి 185 చొప్పున 10 ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బరామచంద్రయ్య కానిస్టేబుల్ రామ్ కుమార్ పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

చాపాడు.ఏప్రిల్ 28.ప్రభాతవార్త :

మైదుకూరు ప్రొద్దుటూరు ప్రధానరహదారి బస్ స్టాప్ వద్ద వెన్నపూస వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్నిమంగళవారం మైదుకూరుఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. వేసవికాలంలో తీవ్ర ఉష్ణోగ్రతల వలన ప్రజల దాహార్తిని తీర్చేందుకు,చల్లటిమజ్జిగ, నీటిని ప్రజలకు అందజేయడం హర్షించదగ్గ విషయంఅన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూఈ ఏడాది కేసి కెనాల్ ఆయకట్టు కింద రైతులకు రెండుపంటలు పండించడంతోపాటుమంచి దిగుబడి రావడంతో రైతుల కళ్ళలో ఆనందం వెల్లివిరుస్తుందన్నారు. అలగనూరుబాలన్సింగ్ రిజర్వాయర్ మరమ్మతుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి 36 కోట్లు నిధులు చెప్పించేందుకు కృషి చేసినట్లు తెలిపారు. ప్రయాణికుల కోసంబస్టాండ్ నిర్మించాలని పాత్రికేయులుఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగాఅందుకు సానుకూలంగాస్పందించారు.ఈకార్యక్రమంలోమండల పార్టీ అధ్యక్షుడు వై వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శిమునిశేఖర్ రెడ్డి, ఏపీఎస్ఐడిసి డైరెక్టర్ అన్నవరం సుధాకరరెడ్డి కేసీ కెనాల్ ప్రాజెక్టు వైస్ చైర్మన్ గురివిరెడ్డి, రాజువారిపేట కిషోర్ కుమార్ రెడ్డి, అక్బర్, సలీం, కిరణ్, రవి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఊపిరి తీస్తే ఊరుకోం...

బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 28: ప్రభాతవార్త :

విలేఖరి జగన్మోహన్‌రెడ్డిని అమానుషంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ, బద్వేల్ వర్కింగ్ జర్నలిస్ట్ మీడియా ప్రతినిధులు మంగళవారం సాయంత్రం భారీ నిరసన చేపట్టారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. తహశీల్దార్ కార్యాలయం నుండి పోలీస్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ, పట్టణంలోని ప్రధాన కూడలి అయిన ఫోర్ రోడ్ సర్కిల్ మీదుగా అర్బన్ పోలీస్ స్టేషన్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా బద్వేల్ వర్కింగ్ జర్నలిస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ జర్నలిస్టులు "జర్నలిస్టుల రక్షణ చట్టం అమలు చేయాలని" మరియు "జగన్మోహన్ రెడ్డి హంతకులను కఠినంగా శిక్షించాలి" అంటూ నినాదాలు చేశారు. అర్బన్ పోలీస్ స్టేషన్ వద్ద సీఐ రామకృష్ణను కలిసి మీడియా మిత్రులందరూ వినతిపత్రం సమర్పించారు.

విలేకరి జగన్మోహన్ రెడ్డి హత్యను పలువురు ఖండించారు.

మైదుకూరు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా వి.కోటలో మంగళవారం ఉదయం విలేకరి జగన్మోహన్ రెడ్డి హత్యకు గురికావడం అత్యంత దారుణమని మైదుకూరుకు చెందిన ప్రముఖ రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్, పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారుణ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే కొంతమంది జర్నలిస్టులు పేదరికంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని గుర్తు చేశారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులకు రక్షణ కరువైందని, వారి పరిరక్షణకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. అంతేకాకుండా వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

బ్రహ్మోత్సవంలో ' రథోత్సవం ' భక్తులకది ఆనందోత్సవం...!

చౌడేపల్లి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త

స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగిన రథోత్సవం భక్తులను అలరించింది. స్వామివారి ఆలయంలో జరుగుతున్న వాహన ఉత్సవాల్లో రథోత్సవానికి ప్రాముఖ్యత వుంది. బలిజసంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించిన రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు రాజశేఖర్‌దీక్షితులు, కుమారస్వామి, మహేష్‌ల ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, అలంకరణగావించారు. రథాన్ని వివిధ రకాల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రసన్న పార్వతీ సమేత మృత్యుంజయేశ్వరస్వామి ప్రతి ఇంటి నుంచి పూజలందుకొన్నారు. పలువురు దాతలచే చల్లని పానీయ కేంద్రాలు నిర్వహించారు. పట్టణంలోని బలిజ సంఘం, వినాయక యువజన సేవా సంఘం నాయకులచే సేవా కార్యక్రమాలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొనింది.

గ్రీన్ అంబాసిడర్లు చెత్తను డంపింగ్ యార్డ్ తరలించాలి

ఎంపీడీవో బాపూజీ పట్నాయక్

తంబళ్లపల్లె ఏప్రిల్ 28 ప్రభాతవార్త ః

గ్రామాలలో సేకరించిన తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలించి ఎరువు తయారు చేయాలని ఎంపీడీవో బాపూజీ పట్నాయక్ గ్రీన్ అంబాసిడర్లుకు సూచించారు. మంగళవారం ఆయన డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్ తో కలిసి కోటకొండ, కుక్క రాజు పల్లి పంచాయితీల్లోని గ్రామాలలో పారిశుద్ధంపై ఆరాతీశారు. అనంతరం డంపింగ్ యార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి సేకరించిన తడి, పొడి చెత్తను సేంద్రియ ఎరువుల తయారీకి సిద్ధం కావాలన్నారు. ప్రతిరోజు పారిశుద్ధంపై దృష్టి సారించి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి చేయూతనివ్వాలని సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లేరు పరిసరాల్లో భయం బ్రహ్మ స్వరూపం చిత్రం షూటింగ్

పీలేరు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:

బెంగుళూరుకు చెందిన క్రిషి స్టూడియోస్, సచిత్ ఫిలిమ్స్, జీవీఆర్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఖిభయం బ్రహ్మ స్వరూపంఖి చిత్రం షూటింగ్ పీలేరు పరిసర ప్రాంతాల్లో జరిగింది. సోమవారం రాత్రి స్థానిక చిత్తూరు మార్గంలోని అగ్రహారం, ఎండీఆర్ కళాశాలలో కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ సందర్భంగా దర్శకుడు ఇడగొట్టి సుబ్రమణ్యం మాట్లాడుతూ మాట్లాడుతూ గేమకర్ హారర్, మెడికర్ థ్రిల్లర్ కథాంశంతో ఈ సినిమా నిర్మిస్తున్నట్లు తెలిపారు. స్థానిక కళాకారులకు అవకాశం కల్పించాలనే లక్ష్యంతో ఈ ప్రాంతంలో కొన్ని సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి సరదా శ్యామ్ కథ అందించారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు వెంకట్ గౌడ్, దర్శన్, హీరో రోహిత్ పేరేడుకు చెందిన్కా హప్ కళాకారులు పఋరుల్లా, సుహేల్, ఆల్ ది బెస్ట్ ఖాదర్బాషా, తరిగొండ రాధాకృష్ణ, బేబీ అంజన, విజయ్ , బాబ్జాన్ ఎం ఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదాం

నిస్సార్ అహ్మద్ పిలుపు

మదనపల్లి ఏప్రిల్ 28 ప్రభాతవార్త:

మదనపల్లె మండలంలోని లోని కొళ్లబైలు 1 గ్రామపంచాయతీ లో మంగళవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం గ్రామ కమిటీ సభ్యులచే నిర్వహించబడింది. ఈ సమావేశంలో మదనపల్లె నియోజకవర్గం సమన్వయకర్త నిస్సార్ అహమద్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి ప్రాణమని పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా, జెండాను మోస్తున్న కార్యకర్తలే వైఎస్ఆర్ సీపీకి అసలైన బలమని నాయకులు కొనియాడారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కొల్లబైలు గ్రామపరిధి లో జరుగుతున్న భూ ఆక్రమణలపై విచారణ జరిపించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను కోరుతున్నామని, ప్రజా సమస్యలపై ప్రస్తుత ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాడాలని రానున్న స్థానిక సంస్థల లో పార్టీ ని గెలిపించి జగనన్న కు కానుకగా ఇవ్వాలని కోరారు. సోషల్ మీడియా వేదికగా పార్టీపై వస్తున్న అసత్య ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్ర మేధావుల ఫోరం కార్యదర్శి వి ఎస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగరాజు, యూనస్, గ్రానైట్ మహేశ్, చిప్పిలి మల్లికార్జున రెడ్డి, శారద రెడ్డి, బడేభాయి , జాబి, బషీర్, సమద్ సాదిక్, సంజీవ్, సత్తార్, గబ్బర్, రవీంద్ర రెడ్డి నజీర్, వడిగల శ్రీకాంత్ రెడ్డి, ఫక్రుద్దీన్, భాను, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం చేయూత

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

మదనపల్లి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :

మదనపల్లి కలెక్టరేట్ ఆవరణంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సహాయ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జీవనోపాధి మెరుగుపరిచే ఉద్దేశంతో 18 సంవత్సరాలు పైబడి 45 సంవత్సరాలు లోపు వయస్సు గల స్వయం ఉపాధి చేసుకునే వారు, చిన్నపాటి ఉద్యోగాలు నిర్వహించే వారు, డిగ్రీ లేదా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్న విద్యార్థులు కలిపి మొత్తం 60 మంది విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా మూడు చక్రాల స్కూటర్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఏపీ విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ జి నారాయణస్వామి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక సంకల్పంతో కృషి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జిల్లాలోని 60 మంది దివ్యాంగులకు ఒక్కొక్కరికి రూ.60 లక్షల విలువైన రెట్రో ఫిట్టేడ్ మూడు చక్రాల స్కూటర్లు ఉచితంగా పంపిణీ చేయడం సంతోషంగా ఉంది. రాష్ట్రంలోనే ప్రథమంగా ఈ పథకానికి జిల్లాలోని లబ్ధిదారులు ఎంపిక కావడం మనందరికీ గర్వకారణం అన్నారు. విభిన్న ప్రతిభావంతుల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, ఈ త్రీ వీలర్ వాహనాలు వారి ఉపాధి అవకాశాలను పెంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఆర్థోపెడిక్ లోకోమోటివ్ వికలాంగత్వం ఉన్నవారికి ఇవి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. ప్రత్యేకంగా ప్రయాణం చేసేటప్పుడు దివ్యాంగులకు ఎన్నో కష్టాలు ఉంటాయి. ఈ ఉచిత మూడు చక్రాల స్కూటర్లు వారి జీవనంలో అవసరాలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ ఏడాది మార్చి 18న దివ్యాంగ శక్తి ఉచిత ప్రయాణాన్ని ప్రభుత్వం కల్పించిందని.. తద్వారా దివ్యాంగులందరికీ లబ్ధి కలిగిందన్నారు. కేంద్ర ఆర్టిఫిషియల్ లింగ్స్ కార్పొరేషన్ ద్వారా రూ1. 68 కోట్ల విలువైన కృత్రిమ పరికరాలు, హియరింగ్ పరికరాలు జిల్లాకు వచ్చాయన్నారు. అవసరమైన వారు ఎవరికైనా పరికరాలు అందజేయడం జరుగుతుందని ఇందుకు సంబంధిత విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. దివ్యాంగుల జీవితాలలో ఇబ్బందులను తొలగించాలంటే ఆర్థిక అభివృద్ధి ముఖ్యం. ఇందుకోసం జిల్లాలోని దివ్యాంగులకు ప్రత్యేకంగా ఆర్థిక అభివృద్ధి ప్రణాళికను రూపొందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను దివ్యాంగులు వినియోగించుకుని అభివృద్ధి పథంలో పయనించి వారి జీవితాలను ఆనందమయం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ మాట్లాడుతూ దివ్యాంగుల నిత్య జీవితానికి, వ్యాపారాలు చేసుకోవడానికి, ప్రయాణాలకు ఈ ఉచిత మూడు చక్రాల స్కూటర్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అందిపుచ్చుకొని వారి జీవితాలను మెరుగుపరచుకోవాలని, మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు.కార్యక్రమంలో ఏపీ విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ జి నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంలో దివ్యాంగులను అన్ని విధాల అభివృద్ధి పరిచేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలోనే ప్రప్రథమంగా నేడు జిల్లాలోని 60 మందికి ఒక్కొక్కరికి రూ.60 లక్షల విలువైన మూడు చక్రాల స్కూటర్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందని, దివ్యాంగ శక్తి పథకం ద్వారా దివ్యాంగులందరికీ ఉచిత ప్రయాణం కల్పించడం పట్ల ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను అవగాహన కల్పించుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని మా జీవనానికి ఉపయోగపడేలా మూడు చక్రాల స్కూటర్లను ఇచ్చిందని, తమ జీవితాలలో ఇవి ఎంతో ఉపయోగపడతాయని ఇందుకు ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ముఖ్య అతిధులచే దివ్యాంగులకు ఉచిత మూడు చక్రాల స్కూటర్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సహాయ కార్పొరేషన్ సహాయ సంచాలకులు ఆర్‌వి కృష్ణ కిషోర్, జిల్లా మేనేజర్, సిబ్బంది, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల నీటి వనరుల పునరుద్ధరణకు సమగ్ర కార్యాచరణ అమలు చేయాలి

జలధార-జలహారతి 100 రోజుల పనులలో వేగం పెంచాలి
ఎన్ఆర్ఈజీఎస్ -రాష్ట్ర డైరెక్టర్ వై.వి.కె.షణ్ముఖ్ కుమార్

మాట్లాడుతున్న ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్

మదనపల్లి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :

జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మదనపల్లిలోని ఆర్ఆర్ కళ్యాణ మండపంలో జలధార-జలహారతి కార్యక్రమంపై అవగాహన మరియు శిక్షణ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ వై.వి.కే. షణ్ముఖ్ కుమార్ అధ్యక్షత వహించారు. అన్నమయ్య మరియు కడప జిల్లాల పరిధిలోని ఎంపీడీఓలు, ఏపీడీలు, ఏటీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు అవగాహన సదస్సుకు హాజరయ్యారు.ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ... గ్రామాల నీటి వనరుల పునరుద్ధరణకు సమగ్ర కార్యాచరణ అమలు చేయాలి. ఇందుకు చెరువులు, ఫీడర్ మరియు సప్లై ఛానల్స్ పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలోని చెరువులకు అనుసంధానంగా ఉన్న ఫీడర్ ఛానల్స్, సప్లై ఛానల్స్, నీటి ప్రవాహ మార్గాలన్నింటినీ సమగ్రంగా పునరుద్ధరించాల్సిన అవసరాన్ని స్పష్టంగా తెలియజేశారు. ఎక్కడ నీటి ప్రవాహానికి అడ్డంకులు ఉన్నాయో వాటిని తొలగిస్తూ, ప్రతి పని ఉపాధి హామీ కూలీలతోనే చేపట్టాలని సూచించారు. దీని ద్వారా నీటి నిల్వ సామర్థం పెరగడంతో పాటు రైతులకు సాగునీరు సమృద్ధిగా అందుతుందని పేర్కొన్నారు. రోజువారి ఉపాధి హామీ శ్రామికుల సంఖ్యను పెంచాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జలధార-జలహారతి కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో సమర్థంగా అమలు చేయడం ద్వారా చెరువులు, కాలువలు పునర్జీవం పొందుతాయని, భూగర్భ జలాలు మెరుగుపడతాయని ఆయన అన్నారు. అన్నమయ్య మరియు కడప జిల్లాలలో ప్రతి అధికారి బాధ్యతతో పని చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద శ్రామికుల సంఖ్యను గణనీయంగా పెంచాలని డైరెక్టర్ స్పష్టం చేశారు. కూలీల నమోదులో నిర్లక్ష్యం వహించినా, పనుల అమలులో ఆలస్యం జరిగినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో ఎక్కువ మందికి ఉపాధి కల్పించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అన్నమయ్య, కడప జిల్లాల డ్వామా పీడీలు శ్రీ వెంకటరత్నం, శ్రీ ఆది శేషారెడ్డి, జిల్లా భూగర్భ జలాల శాఖ ఈఈ సువర్ణ కుమార్, ఎంపీడీఓలు, ఏపీడీలు, ఏటీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మహల్ క్రాస్‌లో మహాభారత యజ్ఞం ప్రారంభం

కలికిరి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

కలికిరి-కలకడ రోడ్డు మార్గంలోని మహల్ క్రాస్‌లో ధర్మకర్త మదనమోహన్‌రెడ్డి, గ్రామస్థుల సహకారంతో మహాభారత యజ్ఞం కార్యక్రమం ప్రారంభమైంది. ఉదయం హరికథలు, బంగారుపాలెం చెందిన గానకోకిల బిరుదాంకితురాలు అయిన భాగవతారిణి రెడ్డికుమారి ఆధ్వర్యంలో హరికథలు అలాగే రాత్రి శ్రీవేంకటేశ్వర నాట్యకళామండలి నిర్వాహకులు రమేష్, మల్లినాయుడుల ఆధ్వర్యంలో రాత్రి నాటకాలు జరుగుతు న్నాయి. మంగళవారం మహాభారత యజ్ఞంలో భాగంగా భాగవతారిణి రెడ్డికుమారి ఆలపించిన భీష్మ విజయం హరికథ అలరించింది. మహాభారత యజ్ఞానికి కలికిరి, కలకడ, కేవీపల్లి, వాల్మీకిపురం గ్రామాల నుంచి సైతం అధిక సంఖ్యలో భక్తాదులు, ప్రజలు హాజరయ్యారు. మహాభారత యజ్ఞానికి వచ్చిన వారు పాండవులు, ద్రౌపతి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారతానికి వచ్చిన ప్రజలకు, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధర్మకర్త మదనమోహన్‌రెడ్డి మహల్ రాచపల్లి గ్రామాలకు చెందిన దాతలు ప్రజలకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మంగళవారం భీష్మ విజయం హరికథకు అధిక సంఖ్యలో హాజరుకావడంతో కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో హార్మోనిస్ట్ సుబ్రమణ్యం, తబలిస్ట్ నారాయణ బృందం పాల్గొన్నారు.

విలేకరి జగన్మోహన్ రెడ్డి హత్యను ఖండించిన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి



పీలేరు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :

చిత్తూరు జిల్లా వి.కోటలో మంగళవారం ఉదయం దారుణ ఘటన చోటుచేసుకుంది. ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డిపై గుర్తు తెలియని దుండగులు కత్తులతో విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశారు. ఉదయం వాకింగ్‌కు వెళ్లిన జగన్మోహన్ రెడ్డిపై దుండగులు ఒక్కసారిగా దాడి చేసి కత్తులతో నరికారు. తీవ్ర గాయాలతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి తీవ్ర ఖండన

ఈ దారుణ ఘటనపై పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "విలేకరి జగన్మోహన్ రెడ్డి హత్య అత్యంత బాధాకరం, అమానుషం. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పత్రికా రంగంపై ఇలాంటి దాడులు క్షమించరానివి" అన్నారు. "దుండగులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి. ప్రభుత్వం విలేకరులకు పూర్తి భద్రత కల్పించాలి" ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆర్ నడింపల్లె గ్రామ దేవతలకు బోనాలు, దీపాలు సమర్పించిన గ్రామస్థులు



రామసముద్రం ఏప్రిల్ 28 ప్రభాతవార్త

రామసముద్రం మండలంలోని ఆర్ నడింపల్లె గ్రామంలో కొలువైన గ్రామ దేవతలకు భక్తి శ్రద్దలతో బోనాలు, దీపాలు మోసి నడింపల్లె గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఆలయాలను గ్రామాన్ని విద్యుత్ దీపాలంకరణ పచ్చని తోరణాలతో ముస్తాబు చేశారు,మంగళవారం రాత్రి ఉత్సవాలు ప్రారంభమైన గంగ జాతర ఉత్సవాలు తెల్లవారి జామున గ్రామస్థులు శాస్త్రో ధికంగా బలి చాట నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు పెద్ద ఎత్తున గంగమ్మలఆలయాలకు చేరుకుని కాయ, కర్పూరం, దీపాలర్పించి గ్రామాన్ని చల్లగా చూడాలంటూ ప్రార్తించారు. ఈ దీపోత్సవం లో డ్రమ్స్ వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ వేడుకలు తిలకించడానికి గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, కర్ణాటక నుండి బంధువులు భారీగా హాజరై ఉత్సహాలను తిలకించారు. ఉత్సవాలు సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘట నలు చోటుచేసుకోకుండా ఎస్సై హృషికేశవ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. గ్రామపెద్దలు, గ్రామ ప్రజలుమాట్లాడుతూ ఆర్ నడింపల్లె గ్రామంలో గంగజాతర 2013లో జరి గిందని 13సంవత్సరాలు తరువాత ఈ గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థులు కలిసికట్టుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసామన్నారు.

చోరీలకు పాల్పడ్డ నలుగురు నిందితులకు జైలు శిక్ష.. జరిమానా

మొలకలచెరువు ఏప్రిల్ 28, ప్రభాతవార్త

పెద్దతిప్పసముద్రం మండలంలో తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడ్డ నలుగురు నిందితులకు జైలు శిక్ష జరిమానా విధించినట్లు పిటిఎం ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. గత 2025సంవత్సరంలో మండలం లోని మద్దయ్యగారిపల్లెలో తాళం వేసిన ఇళ్లే లక్ష్యం గా చోరీలకు పాల్పడ్డ నంద్యాల జిల్లాకు చెందిన దాసరి అంజన్న, బత్తల హరీష్, చంద్రుడు, బత్తల చిన్నహుసేని అలియాజ్ దాసరి జమ్ములును గుర్తించి కేసు నమోదు చేశారన్నారు. తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టులో నేరం రుజువు కావడంతో జడ్జి ఉమర్ ఫరూఖ్ ఏడాది జైలు శిక్ష వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

నాటు సారాయి తరలిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు

ముద్దనూరు,ఏప్రిల్ 28, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఉమారెడ్డి పల్లె సర్కిల్ సమీపంలో మంగళవారం ఉమ్మారెడ్డి పల్లె గ్రామానికి చెందిన క్రాంతి కుమార్ పోలీసులను చూసి పారిపోతుండగా ఎస్ ఐ మధుసూదన్ రెడ్డి అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 10 లీటర్ల నాటు సారాయిని స్వాధీన పరచుకుని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్ ఐ. పేర్కొన్నారు. గ్రామాలలో నాటు సారాయి ఉత్పత్తి చేస్తున్నట్లు పోలీసుల దృష్టికి వస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

రీ సర్వే గ్రామ సభ అవగాహన ర్యాలీ

బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 28 ప్రభాతవార్త.

మండలంలో సోమిరెడ్డి పల్లి 1 లో మే 2 వ తేదీ నుంచి భూముల రీ సర్వే చేపడుతున్నాం రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇది ఒక సువర్ణ అవకాశం అని సర్వే చేసి హద్దులు చూపించి పాస్ పుస్తకాలు మంజూరు చేస్తామని పూర్వపు పట్టా భూములు వుండి అన్ లైన్ లేక వున్న సాగులో వున్నా, భూమి దగ్గరకు మా సర్వేయర్ లు వచ్చి భూముల హద్దులు చూపించి, భాగ పరిష్కాలు వున్న రీ సర్వే లో చేయించు కోవాలని తహశీల్దార్ కార్తిక్ అన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సాంబ శివారెడ్డి, మండల సర్వేయర్ సలీం, సింగిల్ విండో ప్రెసిడెంట్ యల్లటూరు సాంబ శివారెడ్డి, వి ఆర్ ఓ సుధాకర్, సర్వేయర్ ప్రత్యూష, సర్వేయర్ సుధీర్ విఆర్‌ఏలు షఫీ, ఖాసింపీరా, ఉదయ్,రైతులు పాల్గొన్నారు.

మఠం మహా ప్రసాదాన్ని అందించిన పూజారికి సన్మానం

బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 28 ప్రభాతవార్త

శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా చివరిరోజైనా మంగళవారం భక్తులకు మహాప్రసాదతో ఉత్సవాలు ముగిసాయి.శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు అయ్యపు సురేష్ బాబుకు మఠం మఠాధిపతి శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి వారి ఆదేశాల మేరకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానానికి మహా నైవేద్యం అందజేయడం జరిగింది. మహా ప్రసాదాన్ని తీసుకొచ్చిన పూజారి ప్రసాద్ కు అమ్మవారి శాల అధ్యక్షుడు అయ్యపు సురేష్ బాబు ఆర్యవైశ్య లు ఘనంగా సన్మానించడం జరిగింది.మహా ప్రసాదాన్ని అందించిన మఠాధిపతి కి ఆర్యవైశ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ అమరావతి బ్రహ్మం,ఉపాధ్యక్షులు సుంకు చిన్న సిద్దయ్య,బింగి సుధాకర్ మునగనూరి వెంకటేశ్వర్లు,సుంకు నాగేశ్వరరావు,సుంకు పెద్ద సిద్దయ్య,సుంకు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నిందితులను ఉరితీయాలి..

సుండుపల్లె, ఏప్రిల్ 28,ప్రభాతవార్త :

విలేఖరి హత్యకు కారకులైన వారిని ఉరితీయాలని ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు,కూటమి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సుండుపల్లె మండల కేంద్రంలో వి.కోట విలేఖరి జగన్మోహన్ రెడ్డి హత్యను ఖండిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వ్యక్తిని నడిరోడ్డుపై దారుణంగా హత్య చేయడం అమానుషం అన్నారు. ఇలాంటి దురాగత సంఘటనలు మళ్లీ పునరావతం కాకుండా వారి పైన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పాత్రికేయులపై కక్ష సాధింపు చర్యలు బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రమేష్ నాయుడు, మాజీ గ్రామ అధ్యక్షుడు చెన్నం శెట్టి వెంకటరమణ, రెడ్డయ్య రాజు,భాజపా నాయకులు రామ జగదీష్, రమణ గౌడ్, జనసేన నాయకులు శ్రీనివాస్,మచ్చ లక్ష్మీనారాయణ,రెడ్డిరాణి, రామాంజులు, టీబీఎఫ్ నాయకులు వీరనాగయ్య,విద్యార్థి సంఘ నాయకులు,ప్రజాసంఘాల నాయకులు, ఏపీయూడబ్ల్యూజే నాయకులు పల్లం చందు, తిరుపాల్ నాయక్, కర్ణ, అభిషేక్,గోపాల్, సీనియర్ పాత్రికేయులు రమేష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఆన్లైన్ మోసంపై కేసు నమోదు నమోదు

బద్వేలు ,ఏప్రిల్ 28, ప్రభాతవార్త

బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఆన్‌లైన్ మోసం కేసు నమోదు అయినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.. గూడెం గ్రామానికి చెందిన ఊరుబిండి అశోక్, ప్రస్తుతం సాఫ్ట్వేర్ ఉద్యోగిగా చెన్నైలో పనిచేస్తున్నాడు, తన ఫిర్యాదులో తెలియజేసిన వివరాల ప్రకారం, ఊరుబిండి అశోక్‌కు pujithareddy0707" అనే ఇన్‌స్టాగ్రామ్ ఐడి ద్వారా సందేశం రావడం జరిగింది. ఆ ఐడిని నడిపినది మానస అలియాస్ పూజితగా గుర్తించబడింది. అనంతరం నిందితుడు అదూరి రామలింగారెడ్డి, ఆమెను తన బంధువుగా పరిచయం చేసి, ఫిర్యాదుదారుని నమ్మేలా చేశాడు. ఆమె ఫిర్యాదుదారునితో సన్నిహితంగా మారి, ప్రేమ వ్యక్తం చేసి, వివాహం చేసుకుంటానని హామీ ఇచ్చింది."పూజిత రెడ్డి" అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పరచుకొని, ప్రేమ పేరుతో నమ్మకం పొందిన అనంతరం, వివిధ కారణాలు చూపిస్తూ దశల వారీగా భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు తెలిపాడు. ఫిర్యాదు ప్రకారం, పూజితగా పరిచయం అయిన వ్యక్తి, ఆమె కుటుంబ సభ్యులుగా నటించిన వారు మరియు గ్రామానికి చెందిన అదూరి రామలింగారెడ్డి కలిసి కుట్ర పన్ని, ఫోన్‌పే మరియు బ్యాంక్ ఖాతాల ద్వారా సుమారు రూ. 81,67,000/ వరకు డబ్బులు మోసపూరితంగా వసూలు చేసినట్లు ఆరోపించబడింది. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదుపై బద్వేల్ పోలీస్ స్టేషన్ నందు కేసుగా నమోదు చేసి, సంబంధిత వ్యక్తులపై విచారణ ప్రారంభించబడింది. ఈ మోసంలో పాల్గొన్న వారిని గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. ప్రజలు సోషల్ మీడియా ద్వారా పరిచయమయ్యే వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులకు డబ్బులు పంపే ముందు పూర్తిగా ధృవీకరించుకోవాలని పోలీస్ శాఖ సూచిస్తోంది. ఇటువంటి ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సిఐ కోరారు.

వివేకా కేసులో వైఎస్ భాస్కర్ రెడ్డికి బెయిల్

పులివెందుల, ఏప్రిల్ 28 , ప్రభాతవార్త :

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైఎస్సార్‌సీపీ నేత, నియో జకవర్గ ఇన్చార్జి వైఎస్ భాస్కర్ రెడ్డి కు మంగళవారం సీబీఐ న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడం పట్ల పులివెందులలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తో పాటు పార్టీ నాయకులపై విమర్శలు చేసిన వారికి ఇది గుణపాఠమని స్థానిక నేతలు వ్యాఖ్యానించారు. బెయిల్ మంజూరు వార్త వెలువడిన వెంటనే పట్టణంలోని పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్ప, రాష్ట్ర మాజీ సివిల్ సప్లై డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి, కొంగన పల్లి మురళి కుమార్ , కౌన్సిలర్లు మరియు వైసీపీ నాయకులు కలిసి 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నిజాయితీగా ప్రజలకు సేవలు అందిస్తున్న నాయకుల పక్షాన ఎప్పుడూ న్యాయం ఉంటుందని పేర్కొన్నారు. న్యాయస్థానం నిర్ణయం పట్ల పూర్తి గౌరవం వ్యక్తం చేస్తూ, భాస్కర్ రెడ్డి త్వరలోనే ప్రజల మధ్యకి వచ్చి మరింత సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, పులివెందులలో ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమాలు నిర్వహించారు.

30న ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్‌ను విజయవంతం చేయాలి

కడప, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :

ఈ నెల 30వ తేదీన కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిసరాల్లోని అదీప్ ల్యాబొరేటరీ యూనిట్‌లో నిర్వహిస్తున్న ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ చేపట్టి విజయవంతం చేయాలని జిల్లా ఇన్చార్జి డిఆర్వో వెంకటపతి పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్రంలో ఆయిల్, కెమికల్ ఉత్పత్తి కేంద్రాల్లో విపత్తులను ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించే "ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ నిర్వహణ"పై ఏపీఎస్‌డిఎంఏ అధికారులు అన్ని జిల్లాల సంబందిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా ఇంచార్జి డిఆర్వో వెంకటపతి, ఇండస్ట్రీస్ ఇన్స్పెక్టర్ చీఫ్ చిన్నారావ్ సంబందిత శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర సీఎస్ అన్ని జిల్లాల అధికారులతో ఆయిల్, కెమికల్ విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనే చర్యలపై అవగాహనను పెంచే ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. సిఎస్ విసి ముగిసిన అనంతరం ఇన్చార్జి డిఆర్వో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ గారి సూచనల మేరకు, జిల్లా వ్యాప్తంగా అత్యవసర పరిస్థితుల నిర్వహణ సామర్థ్యాన్ని పరీక్షించేందుకు మరియు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడానికి ఈ నెల 30వ తేదీన ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మాక్ డ్రిల్ ప్రక్రియ నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించబడుతుందన్నారు. జిల్లాలోని కొప్పర్తి పరిశ్రమల ప్రాంతంలో ఉన్న "అదీప్ ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్" మరియు సమీపంలోని పరిశ్రమల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ మాక్ డ్రిల్ ప్రక్రియలో భాగంగా.. అగ్ని ప్రమాదం, ప్రమాదకర రసాయనాల లీకేజీ వంటి అత్యవసర పరిస్థితులను మోడల్ రూపంలో ప్రదర్శించి, సంబంధిత విభాగాల సమన్వయాన్ని పరీక్షించనున్నారన్నారు. మాక్ డ్రిల్ సమయంలో కొప్పర్తి పరిసర ప్రాంతాల్లో భద్రతా కారణాల రీత్యా కొన్ని పరిమితులు అమలులో ఉంటాయన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, అధికారుల సూచనలను పాటిస్తూ ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. ఈ మాక్ డ్రిల్ పూర్తిగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగమే అని ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతను దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్న ఈ విన్యాసానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కెఎంసి కమిషనర్ రాకేష్ చంద్రం, ఇండస్ట్రీస్ ఇన్స్పెక్టర్ చీఫ్ చిన్నారావ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇండస్ట్రీస్, విద్యుత్, ఫైర్, ఆర్టీవో, వ్యవసాయ అనుబంధ శాఖలు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో పెట్రోల్,డీజిల్,ఎల్పీజీ కొరతపై
కేంద్ర జోక్యం చేసుకోండి

పులివెందుల ఏప్రిల్ 28 ప్రభాత వార్త :

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ సరఫరాలో ఏర్పడిన తీవ్ర కొరతపై కేంద్ర ప్రభుత్వ జోక్యం కోరుతూ మంగళవారం ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి ఢిల్లీలోని పెట్రోలియం మరియు సహజ వాయువుల కేంద్ర మంత్రిత్వ శాఖ సెక్రటరీ డాక్టర్ నీరజ్ మిట్టల్ కలిసి తన లేఖ ద్వారా కోరారు. ఈ సందర్భంగా ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి వివరిస్తూ రాష్ట్రవ్యాప్తంగా గత కొన్నిరోజులుగా ఇంధన కొరత తీవ్ర స్థాయికి చేరుకోవడంతో ప్రజలు, రైతులు, రవాణా రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వినతి పత్రంలో కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువు మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాలను ప్రస్తావిస్తూ, దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, పీఎస్యూల ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల వద్ద ధరలు పెంచలేదని, ఎల్పీజీ, పీఎన్‌జీ, సీఎన్‌జీ సరఫరా 100 శాతం సామర్థంతో కొనసాగుతోందని వెల్లడించారు. ప్రజలు ఆందోళనకు గురికాకుండా ఉండాలని కూడా కేంద్రం సూచించినట్లు గుర్తు చేశారు. అయితే ఈ పరిస్థితుల్లో కూడా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే సరఫరా లోపం తీవ్రంగా ఉండటం ఆశ్చర్యకరమని వినతిలో పేర్కొన్నారు. ఈ కొరత వల్ల వ్యవసాయం, ఆక్వాకల్చర్, రవాణా రంగాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని, ముఖ్యంగా చిన్న వ్యాపారులు, పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సంక్షోభం కృత్రిమంగా సృష్టించబడిందనే అను మానాలు వ్యక్తం చేస్తూ, కొంతమంది ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సరఫరాను తగ్గించడం, ఎల్పీజీ ధరలను పెంచడం, ఇంధన నిల్వలు దాచిపెట్టడం (హోర్డింగ్), బ్లాక్ మార్కెటింగ్ జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సరఫరా లోపంపై విచారణ జరపాలని, రాష్ట్రవ్యాప్తంగా నిరంతర ఇంధన సరఫరా అందుబా టులోకి తీసుకురావాలని, హోర్డింగ్ మరియు అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎల్పీజీ ధరలపై ఉపశమన చర్యలు చేపట్టాలని వినతి పత్రంలో కోరారు. రాష్ట్రంలో ఇంధన సంక్షోభం రోజురోజుకూ తీవ్రతరం అవుతుండటంతో ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తులకు మహా ప్రసాదం వినియోగం..

బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 28 ప్రభాతవార్త.

జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 333 వ ఆరాధన గురు పూజ మహోత్సవాలలో మఠాధిపతి శ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారు ధర్మపత్ని శ్రీమతి ఉమాదేవి, మఠాధిపతి తమ్ముడు శ్రీ దత్తాత్రేయ స్వామి దర్మపత్ని రాధ, వారి కుటుంబసభ్యులు శ్రీ కనుమ పోలేమ్మ వారి సన్నిధిలో అమ్మవారికి పాల పొంగలి సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అనంతరం శ్రీ కనుమ పోలేర మ్మ వారికి గుడి రథోత్సవంలో మఠం మఠాధిపతులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్న సమయంలో మఠాధిపతి దంపతులు మహా ప్రసాదం పూజా పాల్గొని అశేష భక్తజన వాలికి భక్తుల కు పుర ప్రజలు కు మహా ప్రసాదంను అందించారు. రాత్రి హరికథ, బ్రహ్మం గారి గ్రామోత్సవం నిర్వహించారు.

ఎస్‌బివిఆర్ డిగ్రీ కళాశాలలో ఘనంగా 47వ వార్షికోత్సవం

బద్వేలు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

ఎస్‌బివిఆర్ డిగ్రీ కళాశాలలో 47వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సమిష్టిగా పాల్గొన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా యోగి వేమన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ హాజరయ్యారు. గౌరవ అతిథిగా ఎస్‌బివిఆర్ విద్యాసంస్థల ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే కె. విజయమ్మ పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకట సుబ్బారెడ్డి కళాశాల స్థాపన నుంచి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి, అందుబాటులో ఉన్న వసతులు, విద్యార్థుల ఉపాధి అవకాశాల కోసం అవసరమైన నైపుణ్యాలపై నివేదిక సమర్పించారు. ముఖ్య అతిథి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ మాట్లాడుతూ, ఆశయం లేని విద్య తెలివితేటలు ఉన్నప్పటికీ ప్రయోజనం లేకుండా ఉంటాయని, ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరగలరని సూచించారు. అలాగే జ్ఞానంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించే కోర్సులను ఎంపిక చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ముఖ్య అతిథుల ప్రసంగాల అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజల ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు

పులివెందుల , ఏప్రిల్ 28, ప్రభాత వార్త :

ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల నుండి విముక్తి కల్పించడమే లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పులివెందుల టీడీపీ ఇం చార్జ్ బీటెక్ రవి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మంగళవారం పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో ప్రజా సమస్య ల పరిష్కార వేదికగా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ, గత ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వాటిని సత్వరంగా పరి ష్కరిం చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కారం చూపేం దుకు చర్యలు తీసున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. అదే విధంగా స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రత్యేకంగా ఈ ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని తమ సమస్యలను వినిపిం చారు. అధికారులు వాటిపై స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

సబ్ కలెక్టర్ భావనకు వినతిపత్రం అందజేస్తున్న రాజంపేట పాత్రికేయులు

రాజంపేట, ఏప్రిల్ 28 ప్రభాతవార్త

విలేకరి జగన్మోహన్ రెడ్డిని దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పాత్రికేయులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ రాజంపేటలో మంగళవారం పాత్రికేయులు ధర్నా నిర్వహించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహించి సబ్ కలెక్టర్ హెచ్ఎస్ బావనకు వినతిపత్రం అందజేశారు. పట్టపగలు అందరూ చూస్తున్నా అరాచక శక్తులు హత్యకు పాల్పడటం పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. కూటమి ప్రభుత్వం విలేకరుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమాజంలో అరాచకాలను ఎండ కట్టేందుకు అంకితభావంతో పనిచేసే విలేకరులపై హత్య, దాడులకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని, వీకోట లాంటి సంఘటనలు పునరావడం కాకుండా పోలీసులు ఒక ఉక్కుపాదం మోపాలని కోరారు. హత్యకు గురైన విలేకరి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పాత్రికేయులు ఎం. రామచంద్ర, కె. రమేష్ బాబు, వెంకట్ రెడ్డి, రవిచంద్ర ప్రసాద్, రఘురామరాజు, భాస్కర్, రాయల్, సుబ్బ నరసింహులు, కళ్యాణ్, అశోక్ రెడ్డి, సురేష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఈత నేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు

ప్రొద్దుటూరు ఏప్రిల్ 28 ప్రభాతవార్త

ఈత నేర్చుకోవడం వల్ల ప్రతి ఒక్కరికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని స్విమ్మింగ్ కోచ్, జాతీయ స్విమ్మింగ్ క్రీడాకారుడు లక్ష్మీనారాయణ రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక యర్రగుంట్ల రోడ్డు లోని ఎగ్జిక్యూటివ్ హెల్త్ క్లబ్ నందు నిర్వహించనున్న స్విమ్మింగ్ కోచింగ్ క్లాసుల గురించి ఆయన మీడియా ద్వారా ప్రజలకు తెలుపుతూ ప్రతి ఒక్కరూ ఈ స్విమ్మింగ్ క్లాసులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. చిన్నారులు, యువత తెలిసీ తెలియక మునగబెండుతో ఈతకు వెళ్లడం ప్రమాదకరమని, కానీ తాము ఈ శిక్షణ ద్వారా ఈతలో మెలుకువలు నేర్పిస్తామని వివరించారు. ఈత నేర్చుకోవడం వలన నీటి ద్వారా ప్రాణాపాయం నుండి రక్షణ పొందవచ్చని తెలిపారు. ఈత ఒక మంచి వ్యాయామమని, దీని ద్వారా మన శరీరంలోని ప్రతి అంగం కదులుతుందని, బిపి షుగర్, చాలా రకాల నొప్పుల నుండి ఉపశమనం పొందవచ్చని సూచించారు. ఈతను కూడా విద్య లాగా నేర్చుకోవాలని, ఈత కూడా విద్యలో ఒక భాగం అని, అనుకోని విపత్తుల నుండి ప్రాణం కాపాడుకునే సాధనం ఈత అని వివరించారు. ఈత నేర్చుకోవడం వలన ప్రాణరక్షణ, సాధన ద్వారా ఆరోగ్య రక్షణ, ఈతలో నిష్ణాతులైన వారికి అందజేసే సర్టిఫికేట్ ఎన్నో రకాలుగా ఉద్యోగ ప్రయత్నాలకు పనిచేస్తుందని తెలిపారు. చాలామంది చిన్న పిల్లలకే ఈత నేర్పించాలని ఆలోచిస్తారని, కానీ ఈతకు వయస్సు తో సంబంధం లేని క్రీడ అని, ప్రతి ఒక్కరూ విధిగా ఈత నేర్చుకోవాలని సూచించారు. కాగా ఎగ్జిక్యూటివ్ హెల్త్ క్లబ్ నందు జరిగే ఈ స్విమ్మింగ్ శిక్షణలో పాల్గొనదలచిన వారు మరిన్ని వివరాలకు క్లబ్ లో సంప్రదించాలని తెలిపారు.

విశాఖలో గూగుల్ డేటా సెంటర్
శంకుస్థాపన చారిత్రాత్మకం

బద్వేల్, ఏప్రిల్ 28, ప్రభాత వార్త

విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు కీలక మలుపు అవుతుందని బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ రితేష్ రెడ్డి అన్నారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేవలం ఒక నిర్మాణ ప్రాజెక్ట్ మాత్రమే కాకుండా, రాష్ట్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టే మహత్తర ఆరంభమని పేర్కొన్నారు. దూరదృష్టి కలిగిన నాయకత్వం వల్లే రాష్ట్రానికి భారీ పెట్టుబడులు సాధ్యమవుతున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టెక్నాలజీ ప్రాముఖ్యతను ముందుగానే గుర్తించి హైదరాబాద్‌ను ఐటీ రంగంలో ప్రపంచ స్థాయికి తీసుకెళ్లారని గుర్తుచేశారు. ఇప్పుడు అదే దిశలో విశాఖను గ్లోబల్ డేటా హబ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. 1.35 లక్షల కోట్ల పెట్టుబడి రాబోయే రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించే మార్గదర్శకంగా నిలుస్తుందని, విశాఖను దేశంలో ప్రముఖ టెక్నాలజీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఇది కీలక అడుగని అన్నారు. ఈ సందర్భంగా బద్వేల్ యువతకు ప్రత్యేక పిలుపునిచ్చిన రితేష్ రెడ్డి, సాఫ్ట్‌వేర్‌తో పాటు మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వంటి కోర్ రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో రాయలసీమలో మాన్యుఫ్యాక్చరింగ్, రిన్యూవబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో భారీ పెట్టుబడులు రానున్నాయని, వాటితో వచ్చే ఉద్యోగాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

రైతుల పాలిట శాపాలు చంద్రబాబు, మోడీ ప్రభుత్వాలు

వేంపల్లి: ఏప్రిల్ 28 ప్రభాతవార్త

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం రైతుల పాలిట శాపాలుగా మారాయని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విరుచుకుపడ్డారు. మంగళవారం వేంపల్లిలో తులసిరెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ రైతులు పండించిన ఏ పంటకు కూడా గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. అడిగే వారు లేరు కొనేవారు లేరు. ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు ఉలుకు పలుకు లేకుండా పడి ఉన్నాయి అని ఆవేదన వెలిబుచ్చారు. రాష్ట్రంలో మొక్కజొన్న పండించిన రైతులు విలవిలలాడుతున్నారు. ఈ రబీ సీజన్లో 42.0 6 లక్షల మెట్రిట్ టన్నుల మొక్కజొన్న దిగుబడి వచ్చింది. కేంద్ర ప్రభుత్వము ప్రకటించిన కనీసం మద్దతు ధర క్వింటాలకు రు 2,400, కానీ మార్కెట్లో రైతులు క్వింటాలకు 1600 రూపాయలకు మాత్రమే అమ్ముకుంటున్నారు. ఒక్కొక్క క్వింటాల్ మీద రైతు దాదాపు 800 రూపాయలు నష్టపోతున్నాడు. ఇంతవరకు ఒక్క కొనుగోలు కేంద్రం కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేయలేదు . కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీన మేషాలు లెక్కిస్తూ, లేఖలు రాసుకుంటూ ఉన్నాయి . రోమ్ నగరం తగలబడి పోతా ఉంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయిస్తూ కూర్చున్నట్లు ఉంది. రైతుల మీద ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా పెంచిన రసాయనకి ధరలు వెంటనే తగ్గించాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. మూలిగే నక్క మీద తాటి కాయ పడ్డట్లు డీజిల్ కొరతతో రైతులు విలువిల లాడిపోతున్నారు. ట్రాక్టర్లకు డీజిల్ లభించడం లేదు. వరి కోత యంత్రాలకు డీజిల్ లేని కారణంగా వరి కోతలు నిలిచిపోతున్నాయి. ఆక్వా రైతుల పరిస్థితి దయనీయం. ఏరియేటర్ల నిర్వహణకు డీజిల్ అవసరం. డీజిల్ లభించని కారణంగా ఆక్వా రైతులు కోట్ల రూపాయలు నష్టపోతున్నారు. వారి బాధ వర్ణనాతీతం. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోనే డీజిల్, పెట్రోల్ కొరత ఉండడం రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతకు, చేతగాని తనానికి నిదర్శనమని తులసి రెడ్డి ధ్వజమెత్తారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని పెట్రోలు, డీజిల్ కొరత లేకుండా చూడాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కదిరి ప్రసాద్ గౌడ్, ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లెం విజయభాస్కర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల బెడద... రోగాలతో దడ



తొండూరు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :

లక్షలు ఖర్చు చేస్తున్నాం, పారిశుద్ధం మెరుగుపరిచాం అని అధికారులు చెబుతున్నా, తొండూరు మండలం అగడూరు గ్రామంలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మురుగు కాల్వలు పూడికతో నిండి, వ్యర్థాలు సకాలంలో తొలగించకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. దోమల బెడదతో గ్రామస్థులు రోగాల బారిన పడి దడదడలాడుతున్నారు. క్షేత్రస్థాయిలో దారుణం గ్రామంలోని ప్రధాన వీధుల్లో మురుగు కాల్వలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. నీరు నిలిచిపోయి దోమలకు ఆవాసంగా మారాయి. సాయంత్రం 6 దాటితే చాలు ఇంట్లో దోమల మోత. "పిల్లల్ని బయట ఆడనివ్వలేకపోతున్నాం. రాత్రిళ్లు నిద్ర ఉండట్లేదు. డెంగీ వస్తుందేమోనని భయంగా ఉంది" అని గ్రామంలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలు ఖర్చు ఫలితం సున్నా పారిశుద్ధ్య నిర్వహణ పేరుతో మండల అధికారులు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నట్టు రికార్డుల్లో చూపిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మురుగు సమస్య తీరకపోవడంతో ఆ ఖర్చంతా వృథా అయ్యిందని గ్రామస్థులు మండిపడుతున్నారు.

సంజీవరాయ స్వామి దర్శించుకున్న సిఐ

రాజుపాలెం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త.

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల క్షేత్రంలో గల శ్రీ సంజీవరాయ స్వామిని మంగళవారం ప్రొద్దుటూరు రూరల్ సీఐ నాగభూషణం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెల్లాల బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారిని దర్శించుకొని బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు ఆయన పరిశీలించారు. బ్రహ్మోత్సవాల విశేష కార్యక్రమాలు ఏమిటని ఆలయ కమిటీవారిని , దేవాదాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.



హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం



ప్రొద్దుటూరు ఏప్రిల్ 28 ప్రభాతవార్త

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబులు ఆరోపించారు. మంగళవారం సాయంత్రం స్థానిక దీప్తి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన యుటిఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలను అమలు చేస్తామని, ఆర్థిక బకాయిలను రోడ్ మ్యాప్ ప్రకటించి ఆరు నెలల్లోగా చెల్లిస్తామని, పెండింగ్ డిఏ లను విడుదల చేస్తామని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీలు ఇచ్చిన నేపథ్యంలో కూటమి నేతల మాటలు నిజమని నమ్మి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకరిస్తే కూటమి పెద్దలు ఉద్యోగుల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. పిఆర్సీ గడువు ముగిసి ఇప్పటికే మూడేళ్లు కావస్తున్నదని, కనీసం ప్రభుత్వం పిఆర్సీ కమిషన్ ను నియమించేందుకు ప్రయత్నించడం లేదని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వ హయంలో నియమించిన పిఆర్సీ చైర్మన్ డాక్టర్.మన్మోహన్ సింగ్ రాజీనామా చేసి ఏడాదిన్నర కాలం కావస్తున్నా పిఆర్సీ చైర్మన్ ను నియమించేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నదని విమర్శించారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలలో కేవలం 15వేల కోట్ల రూపాయలను మాత్రమే చెల్లించి, బకాయిలన్నింటినీ చెల్లించామని ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన మిగతా 25 వేల కోట్ల బకాయిల సంగతేంటని ఈ సందర్భంగా వారు ప్రశ్నించారు. డిఏలు చెల్లించకపోతే ఉద్యోగులు ఎలా జీవిస్తారని ప్రతిపక్ష హోదాలో అప్పటి ప్రభుత్వాన్ని నిలదీసిన కూటమి పాలకులు నాలుగు డీఏలను పెండింగ్ లో ఉంచిన సంగతి మర్చిపోయారా అని నిలదీశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు, పాత పెన్షన్ అమలు విధానంపై ఈ రెండేళ్ల కాలంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల గ్రాడ్యుటీ, కమ్యూటేషన్ పూర్తిస్థాయిలో చెల్లింపులు లేవన్నారు. మెమో 57 అమ లులో సాగదీత ధోరణి ఎందుకు అవలంబిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని పదేపదే ప్రకటించుకుంటున్న కూటమి ప్రభుత్వం, ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రభుత్వం లో, ప్రజలలో భాగమనే విషయాన్ని మరిచినట్టున్నారన్నారు. 12వ పిఆర్సీని ఏర్పాటు చేయడంతో పాటు పిఆర్సీ అమ లయ్యే వరకు 29 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, ఆర్థిక బకా యిల తో పాటు పెండింగ్ డిఏలను విడుదల చేయాలని, కారుణ్య నియామకాలను చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. మే 31వ తేదీ లోపు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకపోతే జూన్ మాసంలో ఛలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహించి సెక్రటేరియట్ ను ముట్టడిస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు జిల్లా కార్యదర్శులు ఎన్.కంభగిరి, పి.ఫయాజుద్దీన్, ఎం.శ్రీనివాసులు, కె.మురళీకృష్ణ, జి.గోపీనాథ్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.లోకేశ్వర్‌రెడ్డి, వి.వి.రమణారెడ్డి, పి.రామచంద్ర, కె.చెంచిరెడ్డి, బి.శశికుమార్, జి.మునిరవీంద్రారెడ్డి, బి.నాగరాజు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

కడప కార్పొరేషన్ ఏప్రిల్ 28 ప్రభాతవార్త:

జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాలలో జరిగే వేసవి శిక్షణ శిబిరాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భాను ప్రకాష్, బిజెపి జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డిలు అన్నారు. గ్రంథాలయాలు భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు వారసత్వ వారధులన్నారు. భారతదేశం యొక్క ఔన్నత్యం సమగ్రత విశిష్టత గురించి తెలుసుకోవాలంటే అది గ్రంథాలయాలకు మించిన సాధనం లేదని తెలిపారు . అలాగే ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ కు అనుగుణంగా అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలను లైబ్రరీకి వితరణగా ఇవ్వడం జరిగింది అలాగే నిరుద్యోగ యువతకు ఉపయోగకరమైన పుస్తకాలు కూడా అందజేశారు. మంగళవారం కడప జిల్లా గ్రంథాలయ సంస్థలో పోస్టన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వేసవిలో చిన్నారులందరూ గ్రంథాలయాలల్లో జ్ఞానాన్ని అర్జించడమే కాకుండా వారికి సృజనాత్మకతతో కూడిన కార్యక్రమాలను వినియోగించుకోవాలని తద్వారా దేశ భవిష్యత్తుకు ఉపయోగపడే వ్యక్తులుగా తయారు కావాలని సూచించారు. చిన్నారులు పెయింటింగ్ సృజనాత్మక పెంచుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి షంషుద్దీన్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి యస్.అమీరుద్దీన్, బిజెపి జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, కడప జిల్లా అసెంబ్లీ కన్వీనర్ శివారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు సి.మంజులవాణి, షామీర్, సీనియర్ అసిస్టెంట్ పి. రాజకుమార్, లైబ్రేరియన్స్ తుపాకుల సురేష్, జి. రాజకుమార్, నవాబ్ జాన్, జేమ్స్, గౌస్, శేఖర్, రమణ, సుబ్బమ్మ పాల్గొన్నారు.